క్లుప్తంగా

రెచ్చిపోయిన టీడీపీ మూకలు

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి



బాధితుడు చిరంజీవిని పరామర్శిస్తున్న ఎంపీపీ ప్రసాద్‌నాయుడు

కావలి: దగదర్తి మండలంలో టీడీపీ రౌడీ మూకలు రెచ్చిపోయాయి. ఓటర్లను ప్రలోభ పెట్టడాన్ని అడ్డుకున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై మారణాయుధాలతో దాడి చేసిన ఘటన మంగళవారం వెలుగుచూసింది. కావలి నియోజకవర్గంలో టీడీపీ గెలిచే అవకాశాలు లేకపోవడంతో అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ నాయకులు దాడులకు ప్రేరేపించాడు. ఓటర్లతో పాటు వైఎస్సార్‌సీపీ శ్రేణులను భయభ్రాంతులకు గురి చేశాడు. దగదర్తి మండలం తడకలూరులో పోలింగ్ ప్రశాంతంగా జరుగుతున్న సమయంలో రెచ్చిపోయిన టీడీపీ వర్గీయుడు జలదంకి శ్రీహరినాయుడు, అతని అనుచరులు బీభత్సం సృష్టించారు. పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ నాయకులు ఓటర్లను ప్రలోభానికి గురి చేస్తుండగా వైఎస్సార్‌సీపీ కార్యకర్త చిరంజీవి అడ్డుకున్నాడు. దీంతో టీడీపీ మూకలు అతడిని టార్గెట్ చేశారు. ఒంటరిగా ఉండగా చూసి చిరంజీవిపై ఇనుప రాడ్‌లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. స్థానిక నాయకులు అతన్ని వెంటనే నెల్లూరులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న దగదర్తి ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు బాధితుడు చిరంజీవిని ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ఓటమి భయంతోనే దాడులకు తెగిబడిందన్నారు. పక్కా ప్లాన్‌తోనే తమ పార్టీ కార్యకర్తపై దాడి చేశారన్నారు. ఆయన వెంట తడకలూరు సర్పంచ్ గిరినాయుడు ఉన్నారు.

పోలింగ్ సమయంలో అస్వస్థత

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలోని నెల్లూరుపాళెంలో 104, 105 పోలింగ్ బూత్‌ల వద్ద సోమవారం జరిగిన పోలింగ్ సమయంలో పలువురు మహిళలు అస్వస్థతకు గురయ్యారు. ఓటర్లు తమ ఓటును వినియోగించుకునేందుకు ఆరున్నర గంటలకే కేంద్రానికి చేరుకున్నారు. కేవలం పోలింగ్ బూత్‌ల ముందు మాత్రమే షామియానాలు ఏర్పాటు చేశారు. అయితే ఓటు పోల్ చేసేందుకు అధిక సంఖ్యలో ఓటర్లు రావడంతో ఎండలోనూ క్యూలైన్లలో నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి తోడు రెండు పోలింగ్ బూత్‌లు ఒకే చోట ఏర్పాటు చేయడం, అక్కడకు చేరుకునేందుకు ఇరుకైన మార్గం ఒక్కటే ఉండడంతో తీవ్ర రద్దీ నెలకొంది. ఓ దశలో అధికంగా ఓటర్లు చేరుకున్న క్రమంలో తీవ్ర వేసవి ఎండకు ఊపిరి ఆడక లైన్‌లో అక్కడక్కడ ఉన్న ఏడుగురు మహిళలు సొమ్మసిల్లి పడిపోయారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలోని వైద్య సిబ్బంది వారికి ప్రథమ చికిత్స అందించారు.

ఎన్నికల రాకపోకలకు తప్పని అవస్థ

సీతారామపురం: ఓటు వేయాలనే సంకల్పంతో వలస ఓటర్లు వందల కిలో మీటర్ల దూరం నుంచి గ్రామాలకు చేరుకున్నారు. బస్సుల్లో ఖాళీ లేకపోయినా అష్టకష్టాలు పడి స్వగ్రామాలకు వచ్చారు. గంటల తరబడి క్యూలో నిలబడి ఓట్లు వేశారు. తిరుగు ప్రయాణంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్య, ఉపాధి రీత్యా చెన్నై, పుణె, గోవా, బెంగళూరు, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో ఉంటున్న వారందరూ ఆది, సోమవారాల్లో మండలానికి చేరుకున్నారు.

నెల్లూరుకు ఈవీఎంల తరలింపు

ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గానికి సంబంధించిన 323 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల ఈవీఎం బాక్సులను మంగళవారం సాయంత్రం ఉదయగిరిలోని స్ట్రాంగ్ రూము నుంచి నెల్లూరు ప్రియదర్శిని కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. నియోజకవర్గంలో సోమవారం పోలింగ్ ప్రక్రియ నిర్వహించారు. రాత్రి వరకు పలు మండలాల్లో పోలింగ్ కొనసాగింది. పోలింగ్ ప్రక్రియ తర్వాత ఉదయగిరిలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో వీటిని భద్రపరిచారు. అత్యంత భద్రతా దళాల పర్యవేక్షణలో ఈవీఎంలను తరలించారు. అక్కడే కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించనున్నారు.

ఓటర్లకు, కార్యకర్తలకు ధన్యవాదాలు

కావలి : నియోజకవర్గంలో సంక్షేమాభివృద్ధికి మద్దతు తెలిపిన ప్రతి ఓటరుకు, కార్యకర్తలు, నేతలకు వైఎస్సార్‌సీపీ కావలి ఎమ్మెల్యే అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. రెండు నెలలుగా కష్టపడి పనిచేసిన ప్రతి వైఎస్సార్‌సీపీ నాయకుడు, కార్యకర్త, అభిమానులు, స్నేహితులు, సానుభూతిపరులకు పేరు పేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. గ్రామీణ మండల ప్రజలతో పాటు, కావలి పట్టణ ప్రజలు ఐదు సంవత్సరాల పాటు రాష్ట్రంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి పాలనకు స్వచ్ఛందంగా మద్దతు పలికి ఓటు వేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ ధీమా.. టీడీపీ డైలమా

సార్వత్రిక పోలింగ్ ఘట్టం ముగిసింది. అయితే గెలుపోటములు, మెజార్టీలపై ఉత్కంఠ నెలకొంది. అసెంబ్లీ ఎన్నికల చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ దఫా ఎన్నికల్లో భిన్నత్వం కనిపించింది. గత ఎన్నికల కంటే పోలింగ్ శాతం స్వల్పంగా పెరగడం, ఈ ఎన్నికల్లో ఓటర్లు పోలింగ్ ప్రారంభానికి అర్ధగంట ముందుగానే క్యూలైన్లలోకి రావడంతో, అందులో మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు ఉండడం, ఎండను సైతం లెక్క చేయని విధంగా ఓటర్లు ఓటింగ్‌లో పాల్గొనడం వంటి అంశాలు ఏ పార్టీకి అనుకూలంగా ఉంటాయనే అంచనాలపై రాజకీయ విశ్లేషకులు మల్లగుల్లాలు పడుతున్నారు.

- గత ఎన్నికల కంటే 1.67 శాతం పెరిగిన ఓటింగ్
- అభ్యర్థులు, పార్టీల తలరాతను మార్చిన స్వల్ప శాతాలు
- అసెంబ్లీ ఎన్నికల చరిత్రలో రెండు సార్లే టీడీపీ గెలుపు
- అత్యధికంగా గతంలో కాంగ్రెస్, ఆ తర్వాత వైఎస్సార్‌సీపీ
- మరోసారి వైఎస్సార్‌సీపీకే జైకొట్టిన ఓటర్లు

ఉదయగిరి: పోలింగ్ ముగిసింది.. కౌంటింగ్ జరగాల్సి ఉంది.. అయితే ఈ దఫా ఓట్ల పోలింగ్ సరళి వాతావరణం భిన్నంగా కనిపించింది.



సోమవారం నాటి ఎన్నికల్లో భారీగా పోలింగ్ కేంద్రానికి తరలివచ్చిన ఓటర్లు (ఫైల్)

నియోజకవర్గంలో మొత్తం 2,41,677 మంది ఓటర్లకు 1,97,924 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం మీద 81.90 పోలింగ్ శాతం నమోదైంది. ఇందులో పురుషులు 99,300 మంది, మహిళలు 98,621 మంది, ఇతరులు ముగ్గురు ఓటు వేశారు. 2019 ఎన్నికలకంటే ఈ దఫా పోలింగ్ 1.67 శాతం పెరిగింది. ఆ ఎన్నికల్లో 80.37 శాతం పోలింగ్ జరిగింది. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఒంటరిగా బరిలో దిగగా, టీడీపీ బీజేపీ, జనసేన మద్దతుతో బరిలో నిలిచింది. కాంగ్రెస్ పార్టీ సైతం చిన్న పార్టీల మద్దతుతో బరిలో ఉన్నా ప్రధానంగా వైఎస్సార్‌సీపీ, టీడీపీ మధ్యే పోటీ జరిగింది. ఈ రెండు పార్టీల అభ్యర్థులు విస్తృతంగా గెలుపు కోసం అన్ని అస్త్రశస్త్రాలు ఉపయోగించాయి. స్థానికంగా ఉండే వారితో పాటు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారిని పోలింగ్‌కు రప్పించడంతో రెండు పార్టీలు సఫలమయ్యాయి. దీంతో పోలింగ్ శాతం స్వల్పంగా పెరిగింది. ఈ పెరిగిన ఓటింగ్ శాతం ఎవరికి వారే తమకు అనుకూలంగా భావిస్తున్నారు.

గెలుపోటములను మార్చిన స్వల్ప శాతం

ఉదయగిరిలో ఈ దఫా పెరిగిన 1.67 శాతం ఎవరి తలరాతను మార్చబోతుందనే అంశంపై తీవ్ర చర్చ సాగుతోంది. ఈ నియోకవర్గంలో ఉన్న 2,41,677 ఓట్లలో 1.67 శాతం అంటే.. 4036 ఓట్లు. చాలా సందర్భాల్లో అభ్యర్థులే కాక పార్టీ భవిష్యత్‌ను మార్చింది.. ఈ స్వల్ప స్థాయి శాతాలే. 2014 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కేవలం 2.04 శాతం ఓట్లతోనే అధికారాన్ని కోల్పోయింది. ఆ శాతం ఓట్లనే టీడీపీ అధికారంలోకి వచ్చింది. ఉదయగిరి నియోజకవర్గంలో 2014లో టీడీపీ అభ్యర్థి బొల్లినేని రామారావు 3,622 ఓట్ల ఆధిక్యంతో గట్టెక్కారు. ఈ నేపథ్యంలో స్వల్ప స్థాయిలో ఓట్ల శాతం పెరిగితే ఎవరికి మేలు.. ఎవరి చేటు అనే విషయంలో రాజకీయ పండితులు చర్చిస్తున్నారు.

క్రమేణా పెరుగుతున్న పోలింగ్ శాతం

2009 నుంచి పోలింగ్ సరళిని పరిశీలిస్తే.. క్రమేణా పోలింగ్ శాతం పెరుగుతూ వస్తోంది. 2009లో 72 శాతం పోలింగ్ కాగా అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి విజయం సాధించారు. 2012 ఉప ఎన్నికల్లో 81.4 శాతం పోలింగ్ నమోదైంది. ఈ ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేసిన మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి 30 వేల పైచిలుకు మెజారిటీ సాధించారు. 2014 ఎన్నికల్లో 77.59 శాతం పోలింగ్ నమోదైంది. ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి బొల్లినేని రామారావు 3622 ఓట్లతో గట్టెక్కారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో 80.37 శాతం పోలింగ్ జరగ్గా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి 36,500 ఓట్ల మెజారిటీతో విజయం సాధించి రికార్డు నెలకొల్పారు. ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో 81.90 శాతం పోలింగ్ నమోదైంది. గ్రామీణ ఓటర్లు, మహిళలు, యువత అధిక సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొనడం, ముఖ్యంగా పేద వర్గాల ప్రజలు ఓటు వేసేందుకు ఉత్సాహం చూపడంతో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఓటింగ్ జరిగినట్లుగా భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి భారీ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ నేతలు ధీమాగా ఉన్నారు. ఏది ఏమైనా తుది ఫలితాల కోసం జూన్ 4వ తేదీ వరకు వేచి ఉండాల్సిందే.

గెలుపుపై వైఎస్సార్‌సీపీ ధీమా

ఉదయగిరి అసెంబ్లీ ఫలితాల చరిత్రను ఒకసారి పరిశీలిస్తే.. ఎక్కువ సార్లు కాంగ్రెస్, వైఎస్సార్‌సీపీనే విజయం సాధించాయి. కేవలం రెండు సార్లు మాత్రమే టీడీపీ గెలిచినా.. అభ్యర్థులు అతి స్వల్ప మెజారిటీతోనే గట్టెక్కారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన తర్వాత పేద, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలతో పాటు అగ్రవర్ణాల్లోని పేదలకు మేలు చేకూర్చే విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారు. ముఖ్యంగా యువత కోసం ఎన్నో ఉపాధి అవకాశాలు కల్పించారు. మహిళలకు పలు సంక్షేమ పథకాల ద్వారా నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేశారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా పేద వర్గాల ప్రజల కోసం ఇంత సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయలేదు. కేవలం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాత్రమే వారికి మేలు చేకూర్చింది. ఈ ఎన్నికలు పేదలకు, పెత్తందారులకు మధ్య జరుగుతున్న పోటీగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ నేపథ్యంలో పోలింగ్ తీరును పరిశీలిస్తే.. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు ఎక్కువ సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వినియోగించుకున్నారు. గ్రామీణ ప్రాంత ఓటర్లు కూడా పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. ఈ ఓటు బ్యాంకంతా వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉండటంతో ఆ పార్టీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి విజయం సునాయాసంగా ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. టీడీపీ అభ్యర్థి కేవలం డబ్బును నమ్ముకొనే ఎన్నికలకు దిగారు. పోల్ మేనేజ్‌మెంట్‌లో పూర్తిగా విఫలమైనట్లు ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. దీంతో ఆయన గెలుపుపై మల్లగుల్లాలు పడుతున్నారు.

హ్యాట్రిక్ దిశగా మేకపాటి

- గత ఫలితాలే పునరావృతం
- 2019లో 83.38 శాతం, 2024లో 83.49 శాతం పోలింగ్
- వైఎస్సార్‌సీపీకే జైకొట్టిన ఓటర్లు

ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గంలో గత ఎన్నికల ఫలితాలే పునరావృతం కానున్నాయా.. అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఈ దఫా ఎన్నికల సరళి పరిశీలిస్తే.. మహిళలు, యువత, వృద్ధులు అత్యధికంగా పోలింగ్‌లో పాల్గొనడంతో అది వైఎస్సార్‌సీపీ అనుకూలమని రాజకీయ విశ్లేషకులు విశ్లేషిస్తున్నారు. వైఎస్సార్‌సీపీదే ఏర్పడినప్పటి నుంచి ఆత్మకూరు స్థానం నుంచి ఉప ఎన్నికతో కలిపి మూడు మార్లు పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. అదే తీరులో ఇప్పటి సార్వత్రిక ఎన్నికల్లోనూ అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి ఘన విజయం సాధించనున్నట్లు పోలింగ్ సరళిని బట్టి అర్థమవుతోంది. టీడీపీ ఎన్ని కుయుక్తులు పన్నినా సంతలో పశువుల్లా బేరమాడి పలువురు వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లను కొనుగోలు చేసినా వారికి లాభించలేదు. కారణం నాయకులే అమ్ముడుపోయారుగానీ, ఆయా ప్రాంతాల్లోని ప్రజలు పూర్తిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికే తమ మద్దతు తెలుపుతూ ఓటింగ్ చేశారని తెలుస్తోంది. 2019 ఎన్నికల్లో ఆత్మకూరు నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేసిన మేకపాటి గౌతమ్‌రెడ్డి 22,276 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. ఈ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధితో ప్రజలకు మరింత మేలు చేకూరడంతో 2022లో జరిగిన ఉప ఎన్నికల్లో మేకపాటి విక్రమ్‌రెడ్డి 80 వేల పైచీలుకు ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. 2019లో 83.38 శాతం ఓట్లు పోల్ కాగా 2024లో 83.49 శాతం పోలింగ్ జరిగింది. పెద్దగా ఓట్ల తేడా లేకపోయినా.. గతం కంటే ఎక్కువగా వైఎస్సార్‌సీపీకి మెజార్టీ పెరిగే అవకాశం ఉందని అంచనాలు. ఈ నియోజకవర్గంలో మొత్తం 2,15,401 మంది ఓటర్లు ఉండగా, నిన్న జరిగిన పోలింగ్‌లో 1,79,829 మంది తమ ఓటును పోల్ చేసుకున్నారు.



ఓట్లు పోల్ చేసేందుకు క్యూలైన్‌లో భారీగా వేచి ఉన్న మహిళా ఓటర్లు (ఫైల్)

మండలాల వారీగా పోలింగ్

మండలం	మొత్తం ఓట్లు	పోల్ ఓట్లు	శాతం
ఆత్మకూరు	52,981	42,894	80.96
ఏఎస్‌పేట	27,643	23,374	84.56
సంగం	35,824	30,210	84.33
మర్రిపాడు	35,364	28,921	81.78
సాగరం	35,702	29,758	83.35
చేజర్ల	27,887	24,672	88.47
మొత్తం	2,15,401	1,79,829	83.49

ఆలస్యంగా పూర్తయిన పోలింగ్

ఆత్మకూరు నియోజకవర్గంలోని పట్టణంతో పాటు అనుమసముద్రం, అనంతసాగరం మండలాల్లో రాత్రి 8.30 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. దీనికి తోడు కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్‌కు అంతరాయం ఏర్పడినా ఆ కేంద్రాల్లో 6 గంటల సమయానికే పోలింగ్ పూర్తయింది. అయితే అధిక శాతం పోలింగ్ నమోదైన కేంద్రాల్లో మాత్రమే ప్రక్రియ పూర్తయ్యేందుకు ఆలస్యమైంది.

మహిళా ఓట్లే అత్యధికం

సోమశిల: ఈ ఎన్నికల్లో మహిళలు అత్యధికంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతసాగరం మండలంలోని 45 పోలింగ్ కేంద్రాల్లో పురుషులు 17,688, మహిళలు 18,011 మొత్తం 35,702 ఓట్లు ఉన్నాయి. ఈ ఎన్నికల్లో 14,693 మంది పురుషులు, 15,064 మంది మహిళలు మొత్తం 29,758 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటు హక్కు వినియోగించుకోవడంలో మహిళలు ఆసక్తి చూపించారు. మండలంలో 83.36 శాతం ఓట్లు పోలయ్యాయి.

చేజర్లలో 88.47 శాతం పోలింగ్

చేజర్ల: మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 88.47 శాతం పోలింగ్ నమోదైంది. మండలంలో మొత్తం 27,887 ఓట్లు ఉండగా 24,672 ఓట్లు పోలయ్యాయి. మండలంలోని యనమదల, వావిలేరు, నడిగడ్డ అగ్రహారం పోలింగ్ బూత్‌ల్లో 93 శాతంపైగా పోలింగ్ కాగా, చేజర్ల ఒక పోలింగ్ బూత్‌లో 80 శాతం పెళ్లేరులో 81 శాతం పోలింగ్ నమోదైంది.

ఓటింగ్‌లో మహిళలే అధికం

సంగం: సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు పోటెత్తారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 80 శాతానికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సంగం మండలంలోని 46 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 35,824 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 17,354 మంది, మహిళలు 18,469, ఇతరులు 1 ఉన్నారు. ఇందులో మహిళా ఓటర్లు అత్యధికంగా 15,407 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషులు 14,803 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో మొత్తం మీద 30,210 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో పోలింగ్ 84.33 శాతంగా నమోదైంది. మండలంలో 8 పోలింగ్ కేంద్రాల్లో 90 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. అత్యధికంగా అనుసూయనగర్‌లో 94.89 శాతం, అత్యల్పంగా 199 పోలింగ్ కేంద్రంలో 71.02 శాతం పోలింగ్ నమోదైంది. గడిచిన ఎన్నికలతో పోల్చుకుంటే సంగం మండలంలో పోలింగ్ శాతం అధికంగానే నమోదైంది. గడిచిన ఎన్నికల్లో 29,027 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా ఈ దఫా 30,210 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

వైఎస్సార్‌సీపీ వన్స్ మోర్

- ఈ దఫా ఎన్నికల్లో 83.05 శాతం పోలింగ్
- గత ఎన్నికల కంటే 6.68 శాతం పెరిగిన పోలింగ్
- టీడీపీ మేకపోతు గాంభీర్యం
- సమరోత్సాహంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు

కావలి: సార్వత్రిక ఎన్నికల యుద్ధంలో వైఎస్సార్‌సీపీ భారీగా ఓట్లను కొల్లగొట్టినట్లు అంచనాలు ఉన్నాయి. కావలిలో ఆ పార్టీ మరోసారి హ్యాట్రిక్ విజయాన్ని, అదీ భారీ మెజార్టీ దక్కించుకోనుందని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు. కావలి అసెంబ్లీ ఎన్నికల చరిత్రలో ఇప్పటికి 15 సార్లు ఎన్నికలు జరిగితే, మొట్ట మొదటిసారి రికార్డు స్థాయిలో 83.05 శాతం పోలింగ్ నమోదై సరి కొత్త రికార్డును ఆవిష్కరించింది. గత ఎన్నికలతో పోల్చి చూస్తే 6.68 శాతం ఎక్కువ. దాదాపు 13,233 ఓట్లు ఈ దఫా అదనంగా పోలయ్యాయి. పెరిగిన ఓటింగ్ ఎవరికి అనుకూలంగా ఉంటుందనే అంచనాలపై ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నారు. ప్రధానంగా పల్లెల్లో భారీగా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోగా, పట్టణంలో మాత్రం ప్రజలు ఓటు హక్కును వినియోగించకోవడానికి నిర్లిప్తత ప్రదర్శించారు. ప్రధానంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గడిచిన ఐదేళ్లలో పరిపాలనలో సమూల మార్పులు తెచ్చారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి అండగా నిలవడంతో పాటు వారి ఆర్థిక శక్తిని పెంపొందించేందుకు దోహదపడ్డారు. ఓ వైపు అధికార ప్రభుత్వంపై ప్రజల్లో పాజిటివ్ ఉండగా, ప్రతిపక్షంపై మరింత వ్యతిరేకత కనిపించింది. గ్రామీణ ఓటర్లు పూర్తిగా వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉంటుందని రాజకీయ విశ్లేషకులు లెక్కలు చెబుతున్నాయి. ప్రధానంగా ఈ ఎన్నికల్లో మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు పూర్తిస్థాయిలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం నుంచి అన్ని బూత్‌ల్లో వీరే అత్యధికంగా కనిపించారు. వీరి ఓట్లు వైఎస్సార్‌సీపీకే పడుతాయని అంచనాలు ఉన్నాయి. ఈ లెక్కన పెరిగిన ఓటింగ్‌తో పాటు గ్రామీణ ఓటింగ్ తమకు అనుకూలంగా భారీ మెజార్టీ దిశగా దూసుకుపోతామని వైఎస్సార్‌సీపీ ధీమా ఉంటే.. టీడీపీ మాత్రం మేకపోతు గాంభీర్యంతో మాకే అనుకూలంగా ఉందని చెప్పుకుంటుంది.



వీల్ చైర్‌లో వెళ్లి ఓటేసి వస్తున్న వృద్ధుడు (ఫైల్)

15 ఎన్నికల్లో పోలింగ్ శాతాలు

ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో కావలి నియోజకవర్గంలో 83.05 శాతం పోలింగ్ నమోదైంది.

సం.	శాతం
2019	76.35
2014	79.61
2009	70.83
2004	72.25
1999	71.37
1994	70.47
1989	70.66
1985	68.08
1983	68.62
1978	74.81
1972	64.58
1976	72.17
1962	54.51
1955	53.57
1952	63.96

మండలాల వారీగా పోలింగ్

మండలం	మొత్తం ఓట్లు	పోల్ ఓట్లు (పు)	పోల్ ఓట్లు (మ)	పోల్ అయిన మొత్తం ఓట్లు	పోలింగ్ శాతం
అల్లూరు	42,638	17,743	18,072+2	35,817	84.00
బోగోలు	39,237	16,412	16,594+1	33,007	84.12
దగదర్తి	30,411	13,512	13557	27,069	89.01
కావలిరూరల్	43,028	19,564	19,130+1	38,695	89.93
కావలి అర్బన్	83,239	30,685	32,787+6	63,478	76.26

ఓటెత్తిన గ్రామీణం

నియోజకవర్గంలో పురుషులు 1,17,063 మంది, మహిళలు 1,21,462 మంది, థర్డ్ జెండర్ 28 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 97,931 , మహిళలు 1,00,166, థర్డ్ జెండర్ 10 ఓటు వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో పురుషుల ఓటర్లు కన్నా మహిళా ఓటర్లు 4,399 ఎక్కువగా ఉంటే.. పోలింగ్‌లో పురుషుల ఓటర్లు కన్నా ఎక్కువగా 2,235 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రధానంగా పట్టణం కంటే.. గ్రామీణ ఓటర్లు అధికంగా ఓటింగ్ పాల్గొనడం విశేషం. గ్రామాల్లో నూరు శాతానికి అటూ ఇటూగా పోటీ పడి ఓట్లు వేస్తే.. పట్టణంలో 50 శాతం మంది కూడా ఓటు హక్కు వినియోగించుకోలేదు.

- కావలి మండలం మన్నంగిదిన్నెలో 644 ఓట్లు ఉండగా, 100 శాతం పోలింగ్ జరిగి రికార్డు సృష్టించింది. ఈ బూత్‌లో 306 మంది పురుషులు, 338 మంది మహిళలు ఉన్నారు.
- కావలి మండలం సర్వాయపాళెం మజరా అల్లి గుంటపాళెంలో 97.51 శాతం పోలింగ్ నమోదైంది. ఈ బూత్‌లో 482 మంది ఓటర్లు ఉండగా 470 మంది పోలింగ్ పాల్గొన్నారు.
- కావలి మండలం రుద్రకోట పంచాయతీ గుమ్మడిబొందలలో 97.50 శాతం ఓట్లు పోలయ్యాయి. ఈ బూత్‌లో 480 మంది ఓటర్లు ఉండగా 468 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.
- కావలి పట్టణంలోని 12వ వార్డులో ఉన్న 103 పోలింగ్ బూత్‌లో 42.47 శాతం ఓట్లు పోలయ్యాయి. ఈ బూత్‌లో 784 ఓట్లు ఉండగా కేవలం 333 ఓట్లు మాత్రమే పోలయ్యాయి.
- కావలి పట్టణంలోని 27వ వార్డులో ఉన్న 86వ పోలింగ్ బూత్‌లో 52.05 శాతం ఓట్లు పోలయ్యాయి. ఈ బూత్‌లో 951 మంది ఓటర్లు ఉండగా, 495 మంది మాత్రమే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.
- కావలి పట్టణంలోని 28వ వార్డులోని పోలింగ్ బూత్ 82లో 55.20 శాతం ఓట్లు పోలయ్యాయి. ఈ బూత్‌లో 808 ఓట్లు ఉండగా, 446 ఓట్లు పోలయ్యాయి.